

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,84,528లు, వెండి 54 గ్రాముల 200 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



వృద్ధురాలికి గాయాలు
కోరుకొండ సమితి ఎం.వి.36 గ్రామం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి.
- 8లో.



32 యూనిట్ల రక్తం సేకరణ
జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆదర్శంగా నిలిచారు. తన మనుమరాలి పుట్టినరోజు సందర్భంగా రక్త శిబిరాన్ని నిర్వహించారు.
- 8లో.

మెట్రిక్ పరీక్ష ఫలితాలు వెల్లడి



- 96.07 శాతం ఉత్తీర్ణత నమోదు
- బాలికలదే పైచేయి

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు (బీఎస్ఈ) వార్షిక హైస్కూల్ సర్టిఫికేట్ (మెట్రిక్) పరీక్ష ఫలితాలను ఆదివారం విడుదల చేసింది. ఈ ఏడాది సమగ్రంగా 96.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈసారి అబ్బాయిల కంటే అమ్మాయిలే మెరుగ్గా రాణించారు. బాలుర ఉత్తీర్ణత 95.39 శాతం కాగా, బాలికలు 96.73 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. ఈ ఫలితాల్లో రాష్ట్రంలోని 2,644 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏ పాఠశాలలోనూ శూన్య ఫలితాలు లేకపోవడం విశేషం. రాష్ట్రవ్యాప్తంగా సమగ్రంగా 5,516,11 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 5,30,153 మంది ఉత్తీర్ణులయ్యారు. ఖుర్దా జిల్లాలో అత్యధికంగా 97.98 శాతం మంది ఉత్తీర్ణత సాధించి అగ్రస్థానంలో నిలిచారు. అత్యల్పంగా 93.91 శాతం ఉత్తీర్ణతతో నువాపడా జిల్లా వెనుకబడిందని బోర్డు అధికారులు తెలియజేశారు. కటక్ జిల్లా 97.58 శాతం ఉత్తీర్ణత సాధించగా, జగత్‌సింగ్‌పూర్ జిల్లా 97.6 శాతం, కేంద్రాపడా 95.77 శాతం, జాజ్‌పూర్ 95.92 శాతం, అంగుల్ 96.63 శాతం, ఢెంకనాల్ జిల్లా 95.12 శాతం, పూరి 96.76 శాతం, నయాగడ్ 96.23 శాతం, బాలాసోర్ 96.01 శాతం, భద్రక్ 96.73 శాతం, మయూర్‌భంజ్‌లో 95.7 శాతం, గజపతిలో 97.08 శాతం, గంజాంలో 97.06 శాతం, బౌద్‌లో 95.49 శాతం, కంధమల్‌లో 96.6 శాతం, కలహండిలో 95.86 శాతం, నువాపడాలో 93.91 శాతం, బర్‌గడ్ మరియు సంబలపూర్ జిల్లాల్లో 97.64 శాతం చొప్పున, దేవ్‌గడ్‌లో 96.71 శాతం, ఝార్సుగుడలో 97.28 శాతం, బొలంగీర్‌లో 94.39 శాతం, సువర్ణపూర్‌లో 97.11 శాతం, సుందర్‌గడ్‌లో 97.24 శాతం, కొరాపుట్‌లో 94.82 శాతం, మల్కన్‌గిరిలో 95.04 శాతం, రాయగడలో 96.16 శాతం, నవరంగ్‌పూర్‌లో 94.88 శాతం ఉత్తీర్ణత నమోదు అయింది.

బోర్డు కార్యాలయంలో ఫలితాలు వెల్లడి

ఆదివారం ఉదయం 10.30 గంటలకు కటక్‌లోని బోర్డు ప్రధాన కార్యాలయంలో ఫలితాలు వెల్లడించారు. మెట్రిక్, సంస్కృతం మాధ్యమ మరియు రాష్ట్ర ఓపెన్ స్కూల్ సర్టిఫికేట్ పరీక్ష (ప్రథమ) ఫలితాలు ప్రకటించబడ్డాయి. ఈ ఫలితాలు ఆదివారం ఉదయం 11.30 గంటలకు బోర్డు వెబ్‌సైట్ www.bseodisha.ac.in ఉంచారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని ప్రదేశాల్లో విద్యార్థులు ఓఆర్10 అని టైప్ చేసి, మొబైల్ ఫోన్ ద్వారా 5676750కి ఎస్ఎంఎస్ చేయడం ద్వారా పరీక్ష ఫలితాలను పొందవచ్చు. విద్యార్థులకు పాఠశాల టాబులేషన్ రిజిస్టర్ నంబర్‌తో ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత ఫలితాలు అందుబాటులో ఉంచారు. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు యూజర్ ఐడీ మరియు పాస్‌వర్డ్ ఉపయోగించి ట్యాబులేషన్ రిజిస్టర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫలితాలు రోజునే ధ్రువీకరణ పత్రాలు

ఈ ఏడాది తొలిసారిగా ఫలితాల విడుదల రోజునే విద్యార్థులకు డిజిటలైజ్డ్ బోర్డు సర్టిఫికెట్లు జారీ చేసేందుకు బోర్డు ఏర్పాట్లు చేసింది. మెట్రిక్, సంస్కృతం, ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించిన డిజిటలైజ్డ్ బోర్డు సర్టిఫికెట్లు ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని బీఎస్ఈ ప్రకటించింది. విద్యార్థులు ఈ డిజిటలైజ్డ్ సర్టిఫికెట్‌ను మొబైల్ ద్వారా కూడా యాక్సెస్ చేయవచ్చు. ఉత్తీర్ణులైన విద్యార్థులు బోర్డు వెబ్‌సైట్‌లో సాయంత్రం 4 గంటల నుంచి తమ డిజిటల్ సర్టిఫికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు బీఎస్ఈ/హాయ్ అని రాసి 7710058192కి ఎస్ఎంఎస్ పంపడం ద్వారా దాన్ని పొందవచ్చు.

రీ వాల్యూయేషన్‌కు అవకాశం

విద్యార్థులు పరీక్ష ఫలితాలు విడుదలైన తర్వాత ఈనెల 29 నుంచి జూన్ 12 మధ్య రీ వాల్యూయేషన్‌కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మెట్రిక్ కోసం ఆన్‌లైన్, సంస్కృతం మరియు ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చని బోర్డు తెలియజేసింది. జూన్ 10 నుంచి సప్లిమెంటరీ పరీక్షల నమోదు ప్రారంభం కానుందని బోర్డు అధికారులు తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ అభినందనలు తెలియజేశారు.

సరస్వతీ శిశుమందిర్ శారదా విహార్ హవా..



అభినాష్ పండా (95.16 శాతం)

జయపురం: మెట్రిక్ పరీక్షల ఫలితాల్లో స్థానిక సరస్వతీ విద్యామందిర్ శారదా విహార్ నూరు శాతం ఫలితాలు సాధించింది. 104 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. వారిలో ఏ-1 గ్రేడ్‌లో ఆరుగురు, ఏ-2లో 9 మంది, బీ-1 గ్రేడ్‌లో 21 మంది, బి-2లో 23 మంది, సీ గ్రేడ్‌లో 31 మంది, డీ గ్రేడ్‌లో ఏడుగురు, ఈ గ్రేడ్‌లో ఏడుగురు ఉత్తీర్ణత సాధించారు. ఆరుగురు 90 శాతానికి పైగా మార్కులు సాధించారు. అభినాస్ పండా 95.16 శాతం మార్కులతో మొదటిస్థానం సాధించగా, సహిల్ ప్రతిక్ దొలాయి 93 శాతం,స్మృతి పాణిగ్రహి 92 శాతం, సుహాస్ శుభంకర సాహు 92 శాతం, సుభాంకుర కుంటియ 92 శాతం , రాజనందిని పాలో 91 శాతం మార్కులతో సత్తాచాటారు.

పర్లాకిమిడిలో 97.06 శాతం



సుశోభన్ పాత్రో (92 శాతం)

పర్లాకిమిడి: ఒడిషా టెన్త్ పరీక్షా ఫలితాలకు సంబంధించి గజపతి జిల్లాలో 97.08 శాతం ఉత్తీర్ణులయ్యారు. గంజాం జిల్లాలో 97.06 శాతం మంది పాసయ్యారు. పర్లాకిమిడి సరస్వతీ శిశు విద్యామందిర్ విద్యార్థి సుశోభన్ పాత్రో 600 మార్కులకు 552 మార్కులు సాధించి 92 శాతంతో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించాడు. మొత్తం 58 మంది హాజరవ్వగా అందులో ఏ1గా సుశోభన్ పాత్రో, ఏ2లో ఐదుగురు, బీ1లో 18మంది ఉత్తీర్ణులయ్యారు.

న్యూస్‌రీల్

నడకపై అవగాహన



నడకపై అవగాహన కల్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

రాయగడ: ఆరోగ్యానికి నడక ఎంతో దోహదపడుతోందని సాయిప్రియ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎం.సురేష్‌కుమార్ అన్నారు. రోజూ నడకతో మనిషి వివిధ అనారోగ్యాల బారినుంచి బయట పడతారన్నారు. నడకను జీవితంలో భాగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులవ్వాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆదివారం నాడు సాయిప్రియ వాకర్స్‌క్లబ్, సాయిప్రియ మహిళా వాకర్స్‌క్లబ్‌లు సంయుక్తంగా నడకపై చైతన్యం కలిగించేందుకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం జూన్ నెలలో క్లబ్‌లు చేపట్టే సేవా కార్యక్రమాల ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో క్లబ్ ముఖ్యసహాదారులు సుభాష్ బెహర, దేవరాజ్ పండ, ఉపాధ్యక్షులు కె.ధర్మరాజు, కొశాధికారి టి.ఎస్.రావు , సాయిప్రియ మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్లస్ 2 ఫలితాలు వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్ర ఉన్నత మాధ్యమిక విద్యా మండలి (సీహెచ్‌ఎస్ఈ) నిర్వహించిన 12వ తరగతి లేదా హయ్యర్ సెకండరీ (హెచ్‌ఎస్‌సీ) ఫలితాలను ఆదివారం ప్రకటించింది. సైన్స్, ఆర్ట్స్, కామర్స్, వృత్తి విద్యా కోర్సు పరీక్షల ఫలితాలను ఒకేసారి ప్రకటించారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ నంబర్, రోల్ నంబర్‌ను ఉపయోగించి chseodisha.nic.in లేదా orissaresults.nic.in వెబ్‌సైట్లలో ఫలితాలు పొందవచ్చని తెలిపింది. ఈ సంవత్సరం సైన్స్ విభాగం ఉత్తీర్ణత అత్యధికంగా 86.93 శాతం నమోదు కాగా, కామర్స్ విభాగం ఉత్తీర్ణత 82.27 శాతం, ఆర్ట్స్ విభాగం ఉత్తీర్ణత 80.95 శాతం నమోదైనట్లు సీహెచ్‌ఎస్ఈ చైర్మన్ అశ్విని కుమార్ మిశ్రా తెలిపారు. ఇది కాకుండా వృత్తి విద్య విభాగంలో ఉత్తీర్ణత రేటు 68.02 శాతం నమోదైంది. ఈ ఏడాది ప్లస్ 2 (12వ తరగతి) పరీక్షల్లో బాలుర కంటే బాలికలే మెరుగైన ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 16 నుంచి మార్చి 20 మధ్య నిర్వహించిన పరీక్షలకు 3.59 లక్షల మంది రెగ్యులర్ మరియు 25,000 మంది ఎక్స్-రెగ్యులర్ విద్యార్థులు సహా 3,84,597 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు గవర్నర్ రఘుబర్ దాస్, సీఎం నవీన్ పట్నాయక్ అభినందనలు తెలిపారు.

రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లో దొంగల అలజడి!

- ఏడు సెల్‌ఫోన్ల చోరీ
- రైల్వే పోలీసులకు బాధితుల ఫిర్యాదు



సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ప్రయాణికులు

పర్లాకిమిడి: రొర్కెలా-గుణుపురం రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లో దొంగలు అలజడి సృష్టించారు. ఏడుగురు ప్రయాణికుల నుంచి విలువైన ఏడు సెల్‌ఫోన్లను తస్కరించారు. ఈ విషయమై బాధిత ప్యాసింజర్లు బరంపురంలో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుణుపురం ప్రాంతానికి చెందిన ప్యాసింజర్లు భువనేశ్వర్‌లో శనివారం ఉదయం బయలుదేరారు. వీరిలో ఏడుగురు నిద్రపోయారు. బరంపురం స్టేషన్‌కు వచ్చేసరికి మెలుకవ రావడంతో లేచి చూడగా సెల్‌ఫోన్లు కనపించలేదు. వారు ప్రయాణించే కోచ్‌లో వెతికినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో రైల్వే పోలీసు అధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. బాధితులంతా విషాదంతో ఆదివారం పర్లాకిమిడి చేరుకున్నారు. రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లో తరచూ చోరీలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. ఇదే రైలులో ఇటీవల ప్రయాణించిన పర్లాకిమిడి కోమటివీధికి చెందిన మహిళకు మత్తు పదార్థాలతో కూడిన తినుబండారాలు ఇచ్చి ఒంటిపై ఉన్న బంగారం చైన్‌ను ఇటీవల చోరీ చేశారు.

కిశోర్‌చంద్ర రథ్‌కు సత్కారం



కిశోర్ చంద్ర రథ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: కొలంబోలో ఈ నెల 3 నుంచి 8 వరకు జరిగిన అంతర్జాతీయ అథ్లెటిక్స్-2024లో మూడు బంగారు పతకాలు సాధించిన గజపతి జిల్లా క్రీడాకారుడు కిశోర్ చంద్ర రథ్‌ను స్థానిక గజపతి స్టేడియంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. స్వాస్ స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు డి.జగన్నాథరాజు, ఇతర క్రీడాకారులు ఆయనకు జ్ఞాపిక అందజేసి సత్కరించారు. గజపతి జిల్లా ఎక్సైజ్ శాఖలో విశ్రాంత ఎస్ఐగా పనిచేసిన కిశోర్ చంద్ర రథ్ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

విత్తన ఎంపికపై అవగాహన



ప్రదర్శనలో ఉంచిన విత్తనాలు



హాజరైన రైతులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మండిబిసి పంచాయతీ కేంద్రంలో ఆదివారం విత్తన ప్రదర్శన మేళా నిర్వహించారు. లివింగ్ ఫార్మ్స్ అనే స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సుంగేరు, సిరిపాయి, శంకరడ, సింధూరఘాటి, అడాజొర్, తొలాజొరి, మండిబిసి పంచాయతీలకు చెందిన ఆదివాసీ రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆధునిక వ్యవసాయ విధానాలతో పాటు నాణ్యతమైన విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. వ్యవసాయం రంగంలో నూతన ఒరవడిని సృష్టించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుండటంతో పాటు రైతులకు ఉచితంగా విత్తనాలను సరఫరా చేస్తున్నామని లివింగ్‌ఫార్మ్స్ సంస్థ కన్వీనర్ అనిల్ లిమ్మ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడికి గాయాలు

- ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో తప్పిన పెనుప్రమాదం



ఒకవైపు నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్లో) గాయపడిన డాక్టర్ మణి

రాయగడ: రోడ్డు ప్రమాదంలో వైద్యుడు గాయపడ్డాడు. ఈ సంఘటన జిల్లా కేంద్రానికి సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న రఫ్‌కొన కూడలిలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కొరాపుట్ జిల్లా సిమిలిగుడ ప్రాంతానికి చెందిన ప్రైవేటు వైద్యులు డాక్టర్ ఎం.జి.మణి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు ఎయిర్ బెలూన్ తెరచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. వ్యక్తిగత పనిపై కారులో రాయగడకు వచ్చిన డాక్టర్ ఎం.జి.మణి పనులు ముగించుకుని తిరిగి ఆదివారం సాయంత్రం సిమిలిగుడ వెళ్తున్న సమయంలో రఫ్‌కొన కూడలి వద్ద ఎదురుగా వచ్చిన మ్యాక్స్ పికప్ వ్యాన్ ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో కారు ఒక్క పక్క నుజ్జునుజ్జు అయింది. ప్రమాద సయంలో కారులోని ఎయిర్ బెలున్ తెరచుకోవడంతో వైద్యుడు స్వల్పగాయాలలో బయటపడ్డారు. అయితే కారును ఢీకొట్టిన వ్యాన్ డ్రైవర్ ఆపకుండానే అక్కడి నుంచి పరారయ్యాడు. ప్రమాద సమాచారాన్ని స్థానికులు కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. గాయాలు తగిలిన వెంటనే వైద్యులు స్వయంగా ప్రాథమిక చికిత్స చేసుకున్న తరువాత మరో వాహనంలో సిమిలిగుడ వెళ్లిపోయారు.

ఉత్సాహంగా జిమ్నాస్టిక్ ప్రతిభ పోటీలు



ప్రతిభా పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

జయపురం: జయపురం సమితి పూల్‌బెడ ప్రాంతంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న జిమ్నాస్టిక్ కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిమ్నాస్టిక్ ప్రతిభా పోటీలు ఆదివారం ముగిశాయి. భువనేశ్వర్ జిమ్నాస్టిక్ కేంద్రం కోచ్‌లు ప్రతిభా వంతులను ఎంపిక చేశారు. ఐదు నుంచి 11 ఏళ్లలోపు 38 మంది బాలికలు, 62 మంది బాలలు పోటీల్లో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలో ప్రతిభ చూపిన 70 మందిని ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా క్రీడాధికారి సంతోష్ సాహు, క్రీడా విభాగ ఓఎస్‌డీ జ్ఞానజిత్ త్రిపాఠీ పాల్గొన్నారు.

తీవ్ర తుఫాన్‌గా రీమల్

- రాష్ట్రానికి వర్ష సూచన
- ఓడ రేవుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ
- రాష్ట్రానికి ఆందోళనకర పరిస్థితులు లేవు: ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత సాహు



సత్యబ్రత సాహు

భువనేశ్వర్: ఉత్తర బంగాళాఖాతంలో తుఫాన్ రీమల్ తీవ్ర తుఫానుగా మారిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఉత్తర బంగాళాఖాతం మీదుగా ఏర్పడిన తీవ్రమైన తుఫాన్ రీమల్ గత 6 గంటల్లో గంటకు 13 కిలోమీటర్ల వేగంతో దాదాపు ఉత్తరం వైపు కదిలింది. ఆదివారం ఉదయం 11.30 గంటలకు సమీపంలోని అదే ప్రాంతం ఉత్తర అక్షాంశం 20.2, తూర్పు రేఖాంశం 89.2 ఖేపుపడా (బంగ్లాదేశ్)కి దక్షిణ - నైరుతి దిశలో 220 కిలోమీటర్ల దూరం, మోంగ్లా (బంగ్లాదేశ్)కి దక్షిణంగా 260 కిలోమీటర్లు, సాగర్ దీవులకు ఆగ్నేయంగా 210 కిలోమీటర్లు (పశ్చిమ బెంగాల్), 230 కిలోమీటర్ల బెంగాల్ దక్షిణ-ఆగ్నేయంగా కానింగ్ (పశ్చిమ బెంగాలు) కేంద్రీకృతమై ఉంది. ప్రస్తుతం తుఫాన్ కేంద్రం చుట్టూ గంటకు 115 కిలోమీటర్ల వేగంతో గాలి వీస్తోంది. ఇది దాదాపు ఉత్తరం వైపు కదులుతూ, మరింత తీవ్రమై బంగ్లాదేశ్ మరియు పశ్చిమ బెంగాల్ తీరాలను దాటి సాగర్ ద్వీపం, ఖేపుపడా మధ్య, మోంగ్లా (బంగ్లాదేశ్‌కి నైరుతి దగ్గరగా ఆదివారం అర్ధరాత్రి నాటికి తీవ్రమైన తుఫాన్‌గా మారే అవకాశం ఉంది. ఈ వ్యవధిలో గాలివేగం గంటకు 120 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో ఉంటుంది.

ఒడిశాలో ప్రభావం

దీని ప్రభావంతో ఒడిశాలోని బాలాసోర్, భద్రక్ మారుమూల ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీగా (7 నుంచి 20 సెంటీమీటర్లు), మయూర్‌భంజ్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జిల్లాల్లోని భద్రక్ ప్రాంతంలో 7 నుంచి 11 సెంటీమీటర్లు భారీ వర్షపాతం కురిసే అవకాశం ఉంది. ఉత్తర కోస్తా ఒడిశాలో చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో కొన్ని చోట్ల ఉరుములతో కూడిన వర్ష సూచన జారీ అయింది. బాలాసోర్, మయూర్‌భంజ్, కెంజొహార్, ఢెంకనాల్, పూరి, ఖుర్దా, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, కటక్, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల్లో ఒకటి లేదా రెండుచోట్ల ఉపరితల గాలులు గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ప్రారంభమై, గంటకు 60 కిలోమీటర్ల వేగం పుంజుకునే అవకాశం ఉంది. మే 27 ఉదయం వరకు 50 నుంచి 60 కిలో మీటర్ల వేగంతో వీచే గాలులు గంటకు 70 కిలోమీటర్ల వేగం పుంజుకునే సంకేతాలు జారీ అయ్యాయి. ఉత్తర ఒడిశా తీరం వెంబడి సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మే 27 వరకు మధ్య బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు.

ఓడ రేవుల్లో ప్రమాద సంకేతాలు

రాష్ట్రంలోని పారాదీప్, చాంద్‌బాలి ఓడరేవుల వద్ద స్థానిక హెచ్చరిక సిగ్నల్ నంబర్-3 (ఎల్‌సీ-3), గోపాల్‌పూర్, పూరీ ఓడరేవుల వద్ద సుదూర హెచ్చరిక సిగ్నల్ నంబర్-2 (డీడబ్ల్యూ-2)ని ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ సత్యబ్రత సాహు మాట్లాడుతూ తాము గత 4-5 రోజుల నుంచి బంగాళాఖాతంలో వేసవి తుఫాన్ రీమల్‌ను పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నుంచి అందిన సమాచారం మేరకు ఆదివారం అర్ధరాత్రికి తీరం దాటుతుందన్నారు. రాష్ట్రంలో భయాందోళనకు గురికావలసిన పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. విపత్తు నిర్వహణ కోసం తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని వివరించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ కనబర్చాలి



ఆరోగ్యంపై శిక్షణ ఇస్తున్న ప్రతినిధులు

- ముగిసిన ఆరోగ్య శిక్షణ శిబిరం

జయపురం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని వక్తలు అన్నారు. జయపురం ఫూల్‌బెడ గ్రామ ప్రాంతంలోని ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ కేంద్రం ద్వారా ఆదివాసీ ప్రజల స్థిరమైన ఆరోగ్యంపై కమ్యూనిటీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. శిక్షణ శిబిరంలో కొరాపుట్ జిల్లా దసమంతపూర్, లమతాపుట్ సమితిల నుంచి 35 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ సెంట్ డైరెక్టర్ ప్రశాంత కుమార్ పరిడ మాట్లాడుతూ.. బహుళ ఆదివాసీ ప్రాంతాలలో ఆరోగ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని దూరం చేసేందుకు ఎం.ఎస్.స్వామినాథన్ రిసెర్చ్ కేంద్రం వారు ఈ ప్రాజెక్టు చేపట్టిందన్నార. ఆదివాసీ ప్రజలలో మాతృ, నవజాతి శిశువులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారన్నారు. రక్షిత మంచినీరు తీసుకోవాలని సూచించారు. స్థిరమైన ఆరోగ్యంపై కమ్యూనిటీ చాంపియన్ వర్కర్లతో అధికారులు చర్చించారు. ఆదివాసీ గ్రామాలలో ప్రజలను చైతన్యం చేయడంలో వారి ప్రాధాన్యతను వివరించారు. ప్రాజెక్టు ప్రధాన పరిచాలకులు డాక్టర్ ఆశిద్ మానసింహ, జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ జష్మిన్ మహంతి మహిళలకు శిక్షణ ఇచ్చారు. శిశువులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని డాక్టర్ ప్రశాంత జ్యోతి సూచించారు. శిక్షణ పొందిన వారికి స్మార్ట్ ఫోన్లను బహూకరించారు. గ్రామీణ ప్రాంతాలలో అత్యవసర పరిస్థితి ఉంటే ఈ ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

ప్రబలిన అతిసారా



జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసారా బాధితులు

- రోగులతో కిటకిలాడుతున్న జిల్లా కేంద్రాస్పత్రి

జయపురం: వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులు, క్షీణించిన పారిశుద్ధ్యంతో జయపురంలో అతిసారా వ్యాధి విజృంభిస్తోంది. నాలుగు రోజులుగా స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోజూ కనీసం పది మంది వ్యాధి లక్షణాలతో చేరుతున్నారు. వారిలో ఎక్కువమంది విరేచనాలు, కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఆస్పత్రి ఔట్‌డోర్‌లో అతిసారా రోగులను డాక్టర్లు పరీక్షిస్తూ అవసరమైన మందులు ఇస్తున్నారు. పరిస్థితి బాగా లేని వారిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుతున్నారు.వారికి ఇంజక్షన్, సిలైన్,మందులు, ఓఆర్ఎస్ లు ఇస్తున్నారు. వాంతులు, విరేచనాలతో బాధపడే వారు తమకు తోచిన మందులు వాడకుండా నేరుగా ఆస్పత్రిలో చేరాలని వైద్యులు సూచిస్తున్నారు. కాగా ఆర్థిక స్థోమత ఉన్నవారు చాలామంది ఇదే వ్యాధితో పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. డ్రైనేజ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం, వర్షం పడితే కాలువల్లో మురుగు నీరంతా రోడ్లపైకి రావడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. దీంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలని కోరుతున్నారు.



32 యూనిట్ల రక్తం సేకరణ

జయపురం: జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆదర్శరంగా నిలిచారు. తన మనుమరాలి పుట్టినరోజు సందర్భంగా రక్త శిబిరాన్ని నిర్వహించి 32 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కొరాపుట్ జిల్లా దమంజొడి సమీప మతలాపుట్‌లో ఉంటున్న ఉపాధ్యాయురాలు నళినీ కాంత సేనాపతి తన మనుమరాలు నిబిక్ష పుట్టినరోజు సందర్భంగా ఒడిశా రక్త దాతల మహాసంఘం సహకారంతో దమంజోడి ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. ఒడిశా రక్త దాతల మహాసంఘం అధ్యక్షులు డాక్టర్ నరేష్ చంద్ర సాహు, రాష్ట్రపతి అవార్డు అందుకున్న మరో ఉపాధ్యాయుడు డాక్టర్ అశోక్ మహంతిలు రక్త దాతలను ఉత్సాహపరిచారు. కొరాపుట్ బ్లడ్‌బ్యాంక్ ల్యాబ్ టెక్నీషియన్ రంజిత సాహు, రవీంద్రమిశ్ర సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు



మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి ఎం.వి.36 గ్రామం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. పికప్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో బైక్ వెనుక కూర్చున్న వృద్ధురాలు కింద పడటంతో గాయపడింది. అంబులెన్సు రాక ఆలస్యం కావడంతో బస్సులో వృద్ధురాలిని కోరుకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. బాధితురాలు తర్లాకోట పంచాయతీ సీ-కాలనీకి చెందిన యమున దీసారిగా గుర్తించారు.

క్లుప్తంగా

ముంచుకొచ్చిన ఉప్పటేరు



డొంకూరు, బూర్జపాడు పంట పొలాల్లోకి చేరిన ఉప్పునీరు

ఇచ్ఛాపురం రూరల్ : బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో డొంకూరు మత్స్యకార తీర ప్రాంతంలో సముద్రం అధిక పోటుకు గురైంది. దీంతో స్థానిక పంట పొలాలు ఉప్పుటేరుతో నిండిపోయాయి. ఆదివారం ఉదయం ఉవ్వెత్తున లేచిన కెరటాలతో డొంకూరు, బూర్జపాడు పంట పొలాల్లో నీరు చేరింది. ఖరీఫ్ పంటకు సిద్ధమవుతున్న సమయంలో పొలాల్లోకి ఉప్పు నీరు చేరడం పట్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నేడు ఉద్యోగ విజయోత్సవం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ఉద్యోగ విజయోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య చెప్పారు. కళాశాలలో ఆదివారం ఆయన మాట్లాడుతూ క్యాంపస్ డ్రైవ్‌ల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించి సన్మానిస్తామని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సి.నాగరాణి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. పాలిటెక్నిక్ డిప్లమో పూర్తిచేసిన విద్యార్థులు రిలీవ్ అయ్యే నాటికి శతశాతం ప్లేస్‌మెంట్‌లు సాధించటం లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు చెప్పారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యలో మార్పులు, ఇంటర్న్‌షిప్ అమలు, ప్రయోగ విద్యకు ప్రాధాన్యమిస్తున్నట్లు వివరించారు.

సజావుగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు



హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మూడు కేంద్రాల్లో 1228 మందికిగాను 1212 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. నరసన్నపేట కోర్ టెక్నాలజీస్‌లో మొదటి షిఫ్టులో 320 మందికి 319 మంది, రెండో షిఫ్టులో 320 మందికి 318 మంది, చిలకపాలెం శివానీ కాలేజీలో మొదటి షిఫ్టులో 154 మందికి 150 మంది, రెండో షిఫ్టులో 154 మందికి 149 మంది, ఎచ్చెర్ల శ్రీ వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజీలో మొద టి షిఫ్టులో 140 మందికి 138 మంది, రెండో షిఫ్టులో 140 మందికి 138 మంది హాజరయ్యారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు సిద్ధం చేసిన సహాయ కేంద్రం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్-2024 కౌన్సెలింగ్ సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వేదికగా సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడే ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. జిల్లాలో 10871 మంది పాలిసెట్ రాయగా 9596 మంది ఉత్తీర్ణత సాధించారు. ఐదు ప్రభుత్వ కళాశాలల్లో 780, ఐదు ప్రైవేట్ కళాశాల్లో 1811 సీట్లు కలిపి మొత్తం 2591 సీట్లు అందుబాటులో ఉన్నాయి. జూన్ రెండు వరకు ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించవచ్చు. ర్యాంకు బట్టి ఆఫ్‌లైన్‌లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. మొదటి రోజు సోమవారం 1 నుంచి 12000 మధ్య ర్యాంకు సాధించిన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు. ఈ ప్రక్రియ జూన్ 3 వరకు కొనసాగుతుంది. ఈ నెల 31 నుంచి జూన్ 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాలలు, బ్రాంచ్‌ల ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. జూన్ 5న ఆప్షన్ల మార్పుకు అవకాశం కల్పించారు. జూన్ 7న సీట్ల ఎలాట్‌మెంట్ ప్రకటించనున్నారు. విద్యార్థులు షెడ్యూల్ మేరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం కో-ఆర్డినేటర్ జి.దామోదర్‌రావు తెలిపారు.

నాగావళికి స్వచ్ఛ అందం

- నాగావళి నది శుభ్రతకు ముందుకొచ్చిన 250 మంది యువత
- సహాయమందించిన శ్రీకాకుళం మున్సిపల్ యంత్రాంగం
- ఇకపై ప్రతి ఆదివారం 'క్లీన్ శ్రీకాకుళం'



చెత్తను సేకరిస్తూ..



నాగావళి నదీ తీరాన్ని శుభ్రపరుస్తున్న యువత, మున్సిపల్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్:

జిల్లా కేంద్రంలోని నాగావళి నదిని శుభ్రం చేయాలనే ఒక యువకుడి ఆలోచనకు వందలాది మంది తోడయ్యారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి పరిశుభ్రతా సేవలో భాగస్వాములయ్యారు. వీరి ఆలోచనకు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ సైతం మద్దతుగా నిలిచి తమవంతు సాయం అందించింది. ఫలితంగా ఆదివారం ఉదయం నిర్వహించిన 'క్లీన్ శ్రీకాకుళం' కార్యక్రమం విజయవంతమైంది. శ్రీకాకుళం నగరానికి చెందిన కె.జీవన్ తన ఇన్‌స్టాగామ్ ద్వారా ఇచ్చిన పిలుపు మేరకు సిద్ధార్థరాజ్, ప్రమోద్ నాయుడు, యోగేష్‌నాయుడు ముందుకు రాగా.. వారితో యశ్వంత్, ప్రశాంత్, మధు, హరిష్, ప్రణీత్, భరత్, హర్ష, లక్కీ, స్వరూప్ దుష్యంత్‌లు తోడువచ్చారు. వీరి స్ఫూర్తిగా మరికొంత మందితో నది వద్దకు చేరుకోవడంతో ఆదివారం జరిగిన క్లీన్ శ్రీకాకుళం కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. వీరి కృషిని మెచ్చి మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసరు కూడా స్పందించి సిబ్బందిని పంపించారు.





క్లీన్ శ్రీకాకుళం- స్వచ్ఛ నాగవళి సెల్ఫీ తీసుకుంటూ..

సామాజిక మాధ్యమాల్లో..

నాగావళిని పరిశుభ్రం చేయాలనే ఆలోచనను ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేయగా మంచి స్పందన వచ్చింది. తరువాత ట్విటర్‌లో కూడా పోస్టు చేయడంతో సుమారు 250 మంది ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వీరికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు మాస్కులు, గ్లౌజులు, డస్ట్‌బిన్ బ్యాగులు సరఫరా చేశాయి.

అందరి బాధ్యత..

శ్రీకాకుళం నగర ప్రజలకు జీవనాధారమైన నాగావళి నదిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని క్లీన్ శ్రీకాకుళం సభ్యులు పేర్కొన్నారు. నదిలో పేరుకుపోతున్న చెత్తను తొలగించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ ఆలోచనను కొనసాగిస్తూ 'క్లీన్ శ్రీకాకుళం' పేరుతో ఎక్కడైనా ఇటువంటి సేవా కార్యక్రమం నిర్వహిస్తే తాము ముందుంటామని తెలిపారు. ఇకపై ప్రతి ఆదివారం కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. కార్యక్రమం నిర్వహణకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ప్రతిఒక్కరికీ, ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసరు, సిబ్బంది, ఇన్‌స్టాగామ్ ఇన్‌ఫ్లూయర్స్ హెల్లో చిక్కోలు, క్లీన్ శ్రీకాకుళం, మనీ హంట్ శ్రీకాకుళం, శ్రీకాకుళం వెదర్‌మ్యాన్, శ్రీకాకుళం హవా, ఎక్స్‌ప్లోర్ శ్రీకాకుళం, హెలో శ్రీకాకుళం, మైశ్రీకాకుళం, మా శ్రీకాకుళం, శ్రీకాకుళం అఫీషియల్స్, శ్రీకాకుళం అబ్బాయి, లవ్ శ్రీకాకుళం ఫరెవర్, ప్రశాంత్ వ్లోగ్స్ తదితరులకు ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన సామగ్రిని దాతలు అందించవచ్చని, వివరాలకు 79811 07423, 99632 95929 నంబర్లను సంప్రదించాలని కోరారు.



చేయి..చేయి. కలుపుతూ.. పరిశుభ్రం చేస్తూ..

ఇంటర్‌తో సాఫ్ట్‌వేర్ కొలువు

- రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సాకారం
- ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- శ్రీకాకుళంలో ఈ నెల 31న జాబ్‌మేళా



ఇంటర్మీడియెట్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పూర్తి కాగానే విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కొలువు సాధించే మహత్తర అవకాశం వచ్చింది. ఉద్యోగం చేస్తూనే ఉన్నత చదువులు చదువుకునేలా రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బీ కంపెనీ సంయుక్తంగా ఈ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఇంటర్మీడియెట్‌లో 750, ఆపై మార్కులతో ఉత్తీర్ణులైన అన్ని గ్రూపుల (మ్యాథ్స్ మినహా) విద్యార్థులకూ ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో ఇంటర్ పూర్తి చేసిన, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ ఉద్యోగాలకు అర్హులు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన 400 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు సైతం జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. వీరికి ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్ బీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తారు.



ఈ మూడు కేటగిరీలే కీలకం..

ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత ఎగ్జామ్, ఇంటర్వ్యూ, ఇంగ్లీషు భాష ప్రావీణ్యం పరీక్షిస్తారు. మూడింటిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏడాది పాటు శిక్షణ ఇస్తారు. ఈ కాలంలో ఏడో నెల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున స్టైఫండ్ ఇస్తారు. శిక్షణ అనంతరం ఏడాదికి 1.70 లక్షల ప్రారంభ వార్షిక వేతనం పొందవచ్చు. బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఇతర ఒకేషనల్ కోర్సులు చదివిన వారు అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీఓ విభాగంలో కూడా ఉద్యోగాలు పొందవచ్చు.



హెచ్‌సీఎల్ టెక్ బ్రోచర్

ఉద్యోగం చేస్తూ ఉన్నత విద్యాభ్యాసం..

ఇంటర్‌తో కొలువులో చేరిన విద్యార్థుల చదువు అక్కడితో ఆగిపోకూడదనే ఉద్దేశంతో హెచ్‌సీఎల్ టెక్‌బీ కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించేలా వినూత్నంగా ప్రణాళికను రూపొందించింది. ఇందుకు అనేక యూనివర్సిటీలతో హెచ్‌సీఎల్ టెక్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఫీజు కింద విద్యార్థులకు చెల్లించే జీతంలో హెచ్‌సీఎల్ కంపెనీ ఏటా రూ.15 వేలు ఇవ్వనుంది. విద్యార్థులు రిజిస్ట్రేషన్, సందేహాల నివృత్తి కోసం హెచ్‌టీపీపీఎస్://బిఐటి.ఎల్‌వై/టెక్‌బిఈఈజీవోఏపీ వెబ్‌పోర్టల్‌ను చూడవచ్చు. పూర్తి వివరాలకు సంస్థ ప్రతినిధి సెల్ 6300378377(యోగేష్)ను సంప్రదించవచ్చని జిల్లా ఆర్‌ఐవో పి.దుర్గారావు సూచించారు.

గొప్ప అవకాశం..



జిల్లాలో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఐటీ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నాం. శ్రీకాకుళంలో ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహిస్తున్నాం. ఇంటర్ 75 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

– ఉమ్మడిశెట్టి అనిల్, హెచ్‌సీఎల్ టెక్‌బీ స్టేట్ మేనేజర్

ప్రభుత్వ చొరవతో



విద్యార్థులు ఇంటర్ విద్యతోనే ఉద్యోగం సంపాదించుకునేలా ప్రభుత్వం మంచి ప్రణాళిక రూపొందించింది. కమిషనర్, ఆర్జేడీ ఆదేశాల మేరకు అన్ని యాజమాన్యాల కళాశాలల ప్రిన్సిపాళ్లకు విషయం తెలియజేశాం. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని విద్యార్థులు సైతం జాబ్‌మేళాలో పాల్గొనవచ్చు.

– ప్రగడ దుర్గారావు, ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్‌ఐఓ

ఘనంగా గజవాహన సేవ



నరసన్నపేటలో జరుగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గజవాహనసేవ వైభవంగా నిర్వహించారు. పెద్దపేట మీదుగా మెయిన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, పాతబస్టాండ్ కూడలి వరకూ గజవాహనంపై స్వామివారిని ఊరేగించారు. వందలాది మంది భక్తులు వెంట నడవగా.. పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– నరసన్నపేట

మరిడమ్మ సేవలో ఎస్పీ



ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయం సమీపంలో ఉన్న మరిడమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ జీఆర్ రాధిక అమ్మవారికి పట్టువస్త్రాలు, బోనాలు సమర్పించారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఏడేళ్ల బుడతడు.. గణితంలో ఘనుడు



- మూడో తరగతిలోనే టెన్త్ స్థాయి లెక్కల్లో ప్రావీణ్యం
- రెండు నిమిషాల్లో 197 జాతీయ జెండాల గుర్తింపు
- రెండుసార్లు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు సొంతం

ఇచ్ఛాపురం రూరల్: కొంతమంది విద్యార్థులు లెక్కలంటే హడలిపోతారు. మిగతా సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధిస్తున్నా గణితానికి వచ్చేసరికి వెనకంజలో నిలిచిపోతారు. అయితే ఇచ్ఛాపురానికి చెందిన పడాల పార్థివ్ శ్రీవత్సల్ 'లెక్క' వేరు. ఏడేళ్ల వయసులోనే తన గణిత ప్రావీణ్యతతో పెద్దల్ని సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాడు. అరుదైన రికార్డులను సాధించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించాడు.

లెక్కలపై మక్కువ..

పడాల పార్థివ్ శ్రీవత్సల్ తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే. తండ్రి పడాల అప్పలనాయుడు లొద్దపుట్టి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తల్లి లక్ష్మీ.. అమీన్ సాహెబ్ పేట ప్రభుత్వ పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. వీరి స్వగ్రామం హిరమండలంలోని భగీరథపురం. నాలుగేళ్ల కిందట ఇచ్ఛాపురం మండలానికి బదిలీపై వచ్చారు. పార్థివ్ చిరుప్రాయం నుంచే గణితంపై మక్కువ పెంచుకున్నాడు. గత ఏడాది ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధులు నిర్వహించిన పోటీల్లో గణితంలో 1 నుంచి 50 వరకు ఘణాలు (క్యూబ్‌లు) 1 నిమిషం 36 సెంకడ్లలో రాసి మొదటిసారి వరల్డ్ రికార్డు సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది జనవరి 26న మరోమారు గణితంలో 1 నుంచి 100 వరకు ఘణాలు (క్యూబ్‌లు) కేవలం 4 నిమిషాల 24 సెంకడ్లలో రాసి మరోమారు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు.



రెండు నిమిషాల్లో జాతీయ జెండాలను గుర్తిస్తున్న పార్థివ్ శ్రీవాత్సల్

అవలీలగా పది లెక్కలు..

ఈ బుడతడు మూడవ తరగతిలోనే తొమ్మిది, పదో తరగతి గణిత శాస్త్రంలో ఉండే త్రికోణమితి, వృత్తాలు, ఉపరితల వైశాల్యాలు, ఘన పరిమాణాలు, సాంఖ్యక శాస్త్రం వంటి లెక్కల్ని సునాయాసంగా చేస్తున్నాడు. కేవలం రెండు నిమిషాల్లో 195 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను అవలీగా గుర్తిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు.



తల్లి దండ్రులతో చిన్నారి పార్థివ్ శ్రీవాత్సల్

క్లుప్తంగా

నేడు స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ నగర్‌లో గల జీఎంఆర్ నాగావళి ఉచిత స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (నైరేడ్)లో పలుకోర్సుల్లో శిక్షణ పొందేందుకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు 75 రోజుల రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్.. 30 రోజుల ఎలక్ట్రికల్ అండ్ హౌస్ వైరింగ్.. 30 రోజుల ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు 30 రోజుల హోమ్ నర్సింగ్ (శిక్షణ అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సాయంతో హైదరాబాద్‌లో జాబ్).. 30 రోజుల లేడీస్ టైలరింగ్.. 30 రోజుల మగ్గం వర్క్.. 45 రోజుల డీటీపీ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. లేడీస్ టైలరింగ్‌కు 5వ తరగతి అర్హత, మిగిలిన వాటికి స్త్రీ, పురుష అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణతతో పాటు 19 నుంచి 40 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని నిర్వాహకులు వెల్లడించారు. శిక్షణ సమయంలో భోజన, వసతి సదుపాయాలు ఉంటాయని, ఎస్ఎస్‌సీ మార్క్స్ లిస్ట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో సోమవారం ఉదయం 9.30 గంటలకు నేరుగా రాజాంలోని నైరేడ్‌లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 90147 16255, 94917 41129 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు


హరికామేశ్వరరావు


బంగారు నాయుడు

కొత్తవలస: మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కురిటి హరి కామేశ్వర రావు (32) అదృశ్యంపై ఆయన తల్లి రమణమ్మ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... హరి కామేశ్వరరావు ఈ ఏడాది జనవరి 8వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పుడప్పుడు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేవాడు గాని ఎక్కడ ఉన్నదీ చెప్పేవాడు కాదు. అయితే ఈ నెల మొదటి వారం నుంచి కుటుంబ సభ్యులకు ఫోన్ కూడా రావడం లేదు. అప్పటి నుంచి వెతుకుతున్నా ఫలితం లేకపోవడంతో యువకుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఈ నెల 22 నుంచి మరొకరు..

పూసపాటిరేగ: పూసపాటిరేగ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పిన్నింటి బంగారునాయుడు (72) కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపారు. బంగారునాయుడు ఈ నెల 22వ తేదీ ఉదయం 9 గంటల సమయంలో పూసపాటిరేగ పిన్నింటి కల్లాల వద్ద నుంచి వెంపడాం పైడితల్లి అమ్మవారు పండగకు బంధువుల ఇంటికి బయలుదేరి వెళ్లాడు. అయితే అతను అటు వెంపడాం చేరలేదు.. ఇటు ఇంటికీ రాలేదు. కుటుంబ సభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 91211 09447 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

13 ద్విచక్ర వాహనాలు సీజ్

కొత్తవలస: సరైన పత్రాలు లేని 13 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. మండల కేంద్రంలో సీఐ ఎస్. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్, పాత కొత్తవలస ఆర్చి, రైల్వే క్వార్టర్స్ సమీపంలో వాహన తనిఖీలు చేపట్టి, పత్రాలు లేని వాహనాలు సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై సుదర్శన్ పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో 13 మందికి గాయాలు

కురుపాం: తేనెటీగల దాడిలో 13 మంది గాయపడిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కురుపాం మండల కేంద్రం నుంచి శివ్వన్నపేట గ్రామానికి వెళుతున్న పలువురిపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో 13 మంది గాయపడి కురుపాం సీహెచ్‌సీలో వైద్యసేవలు పొందుతున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉందని వైద్య సిబ్బంది తెలిపారు .

బిత్రపాడులో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామ సమీపంలో ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. మధ్యాహ్నం వరకు నాగావళి నదిలో ఉండి అనంతరం పామాయిల్ తోటలో తిష్ఠ వేశాయి. అరటి, పామాయిల్ తోటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయని అటవీ శాఖాధికారులు వాటిని తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు. రాత్రి సమయాన పంట పొలాలలకు వెళ్లడానికి భయపడుతున్నామని అటవీ సిబ్బంది తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కళ్లికోట చేరుకున్న గజరాజులు

కొమరాడ: ఇటీవల నాగావళి నది ఆవైపు ఉన్న గ్రామాల్లో సంచారం చేసిన ఏడు గజరాజుల గుంపు ఆదివారం కళ్లికోట, దుగ్గి గ్రామ పరిసరాల్లోకి చేరుకుంది. దీంతో కళ్లికోట,దుగ్గి, గుణానుపురం తదితర గ్రామాల ప్రజలు వేసవికాలం నేపథ్యంలో గ్రామాల్లో రాత్రిపూట బయట పడుకోవద్దని ఏనుగులు చొరబడే పరిస్థితి ఉందని జాగ్రత పాటించాలని అటవీశాఖ సిబ్బంది ఆయా సూచిస్తున్నారు. రైతులు పొలాల్లోకి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. ఏనుగులు కనపడితే కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని హితవు పలుకుతున్నారు.

పేదల వరప్రదాయిని... విజయనగరం సర్వజన ఆస్పత్రి



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

- జిల్లా ఆస్పత్రి స్థాయి పెంచి సర్వజన ఆస్పత్రిగా మార్పు
- మెరుగుపడిన వైద్యసేవలు
- అత్యవసర సేవలు సైతం అందుబాటులోకి
- తగ్గిన కేజీహెచ్ రిఫరల్స్
- పెరిగిన ఓపీ, ఐపీ సేవలు
- ఇప్పటికే మోకాళ్ల మార్పిడి, క్యాన్సర్ కణితి తొలిగింపు ఆపరేషన్లు


ఐసీయూలో చికిత్స పొందుతున్న రోగులు


వైద్య పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రిని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా మార్చడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. వైద్య సిబ్బంది మొదలుకుని మౌలిక వసతులు కల్పించడంతో పేద రోగులకు వరప్రదాయినిగా మారిందని చెప్పాలి. జిల్లా ఆస్పత్రిగా ఉన్న సమయంలో అరకొర వసతులు, వైద్య సిబ్బంది తక్కువుగా ఉండడంతో సేవలు కూడా అంతంత మాత్రంగానే అందేవి. సర్వజన ఆస్పత్రిగా మారిన తర్వాత సౌకర్యాలు మెరుగుపడడంతో సేవలు కూడా మెరుగుపడ్డాయి. ప్రస్తుతం కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా సూపర్ స్పెషాలిటీ సేవలైన న్యూరోసర్జరీ, న్యూరోమెడిసిన్, నెఫ్రాలజీ సేవలు కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

తగ్గిన రిఫరల్స్

గతంలో అత్యవసర వైద్య సేవలకు కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యవసర కేసులకు సైతం ఇక్కడే చికిత్స అందిస్తుండడంతో కేజీహెచ్ రిఫరల్స్ బాగా తగ్గాయి. న్యూరోసర్జరీ సేవలు కూడా ఆస్పత్రిలో ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి న్యూరోసర్జరీలు అవసరం పడతాయి. సకాలంలో శస్త్రచికిత్సలు చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడడానికి అవకాశం ఉంటుంది.

క్షతగాత్రులకు ఉపయోగం..

రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలైన వారికి సకాలంలో (గోల్డెన్ అవర్) సర్జరీ చేయగలిగితే ప్రాణాలు కాపాడవచ్చు. సర్జరీ ఆలస్యం అయితే క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇటువంటి సౌకర్యం లేకపోవడం వల్ల ఇంతవరకు రోగులు కేజీహెచ్‌కు గాని ప్రైవేట్ ఆస్పత్రికి గాని వెళ్లేవారు. ఇకపై న్యూరో సర్జరీ సేవలు సర్వజన ఆస్పత్రిలో లభించనుండడంతో ఎంతోమంది ప్రాణాలు నిలిచే అవకాశం ఉంది.

క్లిష్టతరమైన శస్త్ర చికిత్సలు ప్రారంభం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఇప్పటకే క్లిష్టతరమైన శస్త్రచికిత్సలు ప్రారంభించారు. మోకాళ్ల మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్), థైరాయడ్ కణితులు, థైరాయిడ్ క్యాన్సర్ కణితులు, తీవ్రమైన హెర్నియా వంటి క్లిష్ట తరమైన శస్త్రచికిత్సలు ఆస్పత్రిలో ఇప్పటికే జరుగుతున్నాయి. మానసిక రోగులకు షాక్ ట్రీట్‌మెంట్ (ఈసీటీ) కూడా ఆస్పత్రిలో ప్రారంభమైంది.

నెలకు 30 వేల నుంచి 40 వేల మంది రోగులకు..

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో నెలకు 30 వేల నుంచి 40 వేల మంది వరకు రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా ఏడాదికి సుమారు 5 లక్షల మంది వరకు సేవలు అందిస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా 50 వేల నుంచి 60 వేల మంది వరకు చేరుతున్నారు. ల్యాబ్ టెస్టులు 5 లక్షల నుంచి 5.50 లక్షల వరకు చేస్తున్నారు. అలాగే మేజర్ శస్త్ర చికిత్సలు సుమారు ఆరు వేలు, మైనర్ శస్త్రచికిత్సలు సుమారు 20 వేల వరకు చేస్తున్నారు.

అందుబాటులో ఉన్న విభాగాలు..

ఆస్పత్రిలో ఈఎన్‌టీ, డెంటల్, ఎన్‌సీడీ, ఏఆర్‌టీ, కంటి, చర్మవ్యాధులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పలమనాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, న్యూరో సర్జరీ, ఫోరిన్సిక్, బయోకెమిస్ట్రీ వంటి విభాగాలున్నాయి. అదేవిధంగా డిజిటల్ ఎక్సరే, ఈసీజీ, సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ , టూడీ ఇకో సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే లేబరరేటరీ కూడా ఉంది. క్యాన్సర్ నిర్ధారణ చేసే ఎఫ్ఎన్‌ఏసీ పరీక్షలు కూడా ఆస్పత్రిలో జరుగుతున్నాయి. ముఖ్యంగా యూరిన్ కల్చర్, బ్లడ్ కల్చర్ వంటి అధునాతన వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.


పలమనాలజీ విభాగంలో రోగికి మందులు వేసుకోవడంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మెరుగైన వైద్యసేవలు



మా బంధువుకు ఆరోగ్యం బాగోలేదని సర్వజన ఆస్పత్రికి వెళ్లాం. అక్కడి వైద్యులు పరీక్షించి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి మందులు కూడా అందించారు. ఆమె ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉంది. వైద్య సేవలు బాగా అందిస్తున్నారు.

– దుక్క రమణ , పెదవేమలి గ్రామం

కరాటేతో ఆత్మరక్షణ

- సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు


కరాటేలో తలపడుతున్న చిన్నారులు

విజయనగరం: శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అన్నారు. నగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో కెన్ యు ర్యూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో 17వ రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. కరాటే అసోసియేషన్ విజయనగరం చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె. సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ చాంపియన్‌షిప్ పోటీలకు సత్య విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కరాటే 17వ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలను విజయనగరంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, చిన్నారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుమన్, చాంపియన్‌షిప్ చీఫ్ ఆర్గనైజర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. పోటీల నిర్వహణకు అన్ని విధాలుగా సహకరించిన సత్యా విద్యా సంస్థల డైరెక్టర్ శశిభూషణరావుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రిఫరీలు, న్యాయమూర్తులు, కోచ్‌లు, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో


సంఘటనా స్థలంలో ఆటో, స్కూటీ


108 వాహనంలో క్షతగాత్రులు

రామభద్రపురం: మండల కేంద్రంలోని సాలూరు రూట్‌లో ఉన్న వై జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం పల్లంలేవిడి గ్రామానికి చెందిన పెద్దింటి చలపతి రావు, పాలక రాజీవ్ ద్విచక్రవాహనంపై సాలూరు నుంచి రామభద్రపురం వైపు వస్తుండగా.. అదే సమయంలో రామభద్రపురం నుంచి మక్కువ వెళుతున్న ఆటో వీరిని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆటోలో 8 మంది ప్రయాణిస్తుండగా అందులో రామభద్రపురం ఎగువ హరిజనవీధికి చెందిన గొల్లపల్లి పార్వతి, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన సారిపి అనూష, పార్వతీపురం పట్టణం రెల్లివీధికి చెందిన రాజాన అంకితలతో పాటు మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. తీవ్రగాయాలపాలైన ద్విచక్ర వాహనదారులు చలపతిరావు, రాజీవ్‌లను మెరుగైన చికిత్స కోసం బాడంగి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్రవాహనదారుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే, ఎంపీ


మల్లన్న సన్నిధిలో పూజలు చేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, తదితరులు

పూసపాటిరేగ: కర్నూలు జిల్లా శ్రీశైలంలో వెలసిన మల్లికార్జునస్వామిని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి స్వాగతం పలికారు. దగ్గరుండి స్వామివారి దర్శనం చేయించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, అన్నదాతలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.

● అ‘పూర్వ’ కలయిక


1990 -91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: నెల్లిమర్ల నగర పంచాయతీలో గల గవర్నమెంట్ సీకేఎంజీజే స్కూల్ 1990-91 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించడంతో పాటు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు.

అనుమానాస్పద వ్యక్తులపై నిఘా


కార్డన్‌సెర్చ్‌లో భాగంగా వైఎస్సార్ నగర్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న టూటౌన్ సీఐ కోరాడ రామారావు

విజయనగరం క్రైమ్: అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టేందుకు టూటౌన్ పరిధిలో ఉన్న వైఎస్సార్ నగర్‌లో ఆదివారం వేకువజామున టూటౌన్ సీఐ కోరాడ రామారావు నేతృత్వంలో జిల్లా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికల గురించి, రికార్డులు సక్రమంగా లేని వాహనాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కాలనీలోని ప్రతి ఇంటి పరిసరాల్లో, వీధుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల్ని ప్రశ్నించి, వారు ఎవరింటికి, ఏ పని మీద వచ్చారన్న విషయాలపై ఆరా తీశారు. అదేవిధంగా వాహన రికార్డులు సక్రమంగా లేని 31 మోటార్‌సైకిళ్లను స్టేషన్‌కు తరలించారు. వాహనపత్రాలు పరిశీలించి, పత్రాలు సక్రమంగా ఉన్న వాహనాలను రిలీజ్ చేస్తామని, రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేసి, చట్టపరమైన చర్యలు చేపడతామని టూటౌన్ సీఐ కోరాడ రామారావు స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటుచేసేందుకు ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించామన్నారు. భవిష్యత్తులో మరికొన్ని ప్రాంతాల్లో ఇదే తరహా ఆపరేషన్స్ చేపడతామని చెప్పారు. కార్డన్ సెర్చ్‌లో ఎస్సైలు దుర్గాప్రసాద్, రాజేష్, ఏఎస్సై పైడితల్లి, సిబ్బంది పాల్గొన్నారు.



నీడపట్టున వేతనదారులు..

ఎండలు మండుతుండడంతో కనీసం ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. కాని ఉపాధి వేతనదారులు మండుటెండలోనూ పనులు చేస్తున్నారు. గతంలో వేతనదారులకు కనీస వసతులు కల్పించేవారు కాదు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో టెంట్లు, తాగునీరు, మెడికల్‌కిట్లు అందుబాటులో ఉంచడంతో వేతనదారులకు స్వాంతన చేకూరినట్టైంది. ధర్మపురం – చింతలవలస మధ్యలో గల ఎర్ర చెరువులో పనులు చేస్తున్న వేతనదారులు ఎండ ఎక్కువగా ఉండేసరికి నీడపట్టుకు చేరిన దృశ్యం సాక్షి క్లిక్ మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

కీటక జనిత వ్యాధులకు చెక్..


గుమ్మలక్ష్మీపురం మండలం వంగర గ్రామంలో మలేరియా మందు పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్ మోహనరావు

- ముమ్మరంగా నియంత్రణా చర్యలు
- పార్వతీపురం – మన్యం జిల్లాలో 401 మలేరియా ప్రభావిత గ్రామాలు
- కొనసాగుతున్న మొదటి విడత ఏసీఎం 5 శాతం మందు పిచికారీ పనులు

గుమ్మలక్ష్మీపురం: కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతోంది. ముఖ్యంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడకుండా ఈ వ్యాధులను కలుగజేసే దోమల నియంత్రణకు జిల్లా మలేరియా నివారణ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో గల 12 మండలాల్లోని 28 పీహెచ్‌సీల పరిధిలో 401 మలేరియా ప్రభావిత గ్రామాలను గుర్తించారు. ఈ గ్రామాల్లో ఈనెల 15వ తేదీ నుంచి మొదటి విడత దోమల మందు (ఏసీఎం 5 శాతం) పిచికారీ చేపడుతున్నారు. జూన్ నెలాఖరులోగా ఎంపిక చేసిన గ్రామాల్లో పిచికారీ పూర్తి చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటికే పలు గిరిజన, గిరిశిఖర గ్రామాల్లో దోమల మందు పిచికారీని పూర్తిచేశారు. పిచికారీకి సంబంధించిన ప్రణాళికకు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు ఆమోదం తెలిపడంతో పాటు నెల రోజుల ముందుగానే వైద్య సిబ్బందికి (ఎన్‌సీవీబీడీసీ పరిధిలో) రీ ఓరియెంటేషన్ ట్రైనింగ్ కూడా ఇచ్చారు. వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల సమన్వయంతో మొదటి విడత పిచికారీ అధికారుల పర్యవేక్షణలో కొనసాగుతోంది.

132 గ్రామాల్లో పిచికారీ పూర్తి

జిల్లాలోని 7 సబ్ యూనిట్ల పరిధిలోని 28 పీహెచ్‌సీల పరిధిలో గల 132 గ్రామాల్లో మలేరియా నివారణ మందు మొదటి విడత పిచికారీ పనులు పూర్తయ్యాయి. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలో 19 గ్రామాల్లో.. కురుపాం మండలంలో 7 గ్రామాల్లో.. కొమరాడ మండలంలో 19 గ్రామాల్లో.. పార్వతీపురం మండలంలో 22 గ్రామాల్లో.. సాలూరు మండలంలో 12 గ్రామాల్లో.. పాచిపెంట మండలంలో 14 గ్రామాల్లో.. సీతంపేట మండలంలో 23 గ్రామాల్లో.. భామిని మండలంలో 10 గ్రామాల్లో.. వీరఘట్టం మండలంలో 5 గ్రామాల్లో మొదటి విడత ఏసీఎం ఐదు శాతం మందు పిచికారీ పనులు పూర్తయ్యాయి. మిగతా 269 గ్రామాల్లో పిచికారీ పనులు ప్రారంభించనున్నారు.


డెంగీ లక్షణాలు..

డెంగీ వ్యాధి ఎడిస్ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి, శరీరంపై దద్దుర్లు, వాంతులు, వికారం, రక్తస్రావం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీని నిర్ధారణకు క్షేత్ర స్థాయిలో ఎన్ఎస్–1 కిట్లు ఉపయోగిస్తున్నారు. డెంగీ తుది నిర్ధారణకు జిల్లాల్లో రెండు ఎస్ఎస్‌హెచ్ కేంద్రాలున్నాయి. ఒకటి పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రి కాగా రెండోది పాలకొండలోని ప్రాంతీయ ఆస్పత్రి.

మలేరియా లక్షణాలు..

ఎనాఫిలస్ దోమల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చలి, వణుకుతో కూడిన జ్వరం విడిచి, విడిచి రావడం దీని లక్షణం. దీని నిర్ధారణకు ఆస్పత్రుల్లో ర్యాపిడ్ కిట్లు, రక్తపూతల స్లైడ్స్ ఉపయోగిస్తున్నారు. జిల్లాలోని దుడ్డుఖల్లు, మాదలింగి, రేగిడి, తోణాం, జీఎస్ పేట, దోనుబాయి, నీలకంఠాపురం, తాడికొండ, కేఆర్బీ పురం పీహెచ్‌సీల పరిధిలో ఈ ఏడాది మలేరియా కేసులు నమోదయ్యాయి.

ముమ్మరంగా నివారణ చర్యలు



మలేరియా, డెంగీ గుర్తించిన గ్రామాల్లో ఏసీఎం ఐదు శాతం ద్రావణం పిచికారీ, ఫాగింగ్, ఫీవర్ సర్వేలెన్స్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తూ మలేరియా, డెంగీ నియంత్రణకు కృషి చేస్తున్నాం. ఆయా మండలాలు, పట్టణాల్లో జ్వరాలు, దోమల నియంత్రణ, పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత అంశాలపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నాం. దోమల నివారణ కోసం చేపడుతున్న పిచికారీ పనులు ఎంపిక చేసిన గ్రామాల్లో సజావుగా సాగుతోంది.

– డాక్టర్ టి.జగన్ మోహనరావు, జిల్లా మలేరియా నివారణ అధికారి, పార్వతీపురం మన్యం